సాక్షి
చిత్తూరు
బుధవారం । 29 । మార్చి । 2023



సంకల్ప పూజలు

శ్రీకాళహస్తి: ముత్యాలమ్మ గుడి ఎదురుగా శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధాలయమైన చక్రేశ్వరస్వామి బాలాలయ స్థాపనలో భాగంగా మంగళవారం సంకల్ప పూజలు నిర్వహించారు.



బాలాలయ స్థాపన

శ్రీకాళహస్తి: పొన్నాలమ్మ గుడి సమీపంలో శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన శ్రీ చెల్లేశ్వరస్వామి బాలాలయ స్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అంతా రామ మయం

శ్రీకాళహస్తి : జిల్లాలో శ్రీరామనవమి పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రామమందిరాలను చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలతో చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు.



న్యూస్‌రీల్

'పది' పరీక్షల అబ్జర్వర్‌గా ముప్వా రామలింగం

చిత్తూరు కలెక్టరేట్ : పదోతరగతి పరీక్షల అబ్జర్వర్‌గా సర్వీసెస్ జేడీ ముప్వా రామలింగం నియమితులయ్యారు. ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నిర్వహించే పదో తరగతి పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

కోవిడ్ టెస్ట్‌లకు ఆదేశం

చిత్తూరు రూరల్: కోవిడ్ మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. జిల్లాలో రోజూ కనీసం కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం రోజూ 20 నుంచి 30 ర్యాపిడ్ పరీక్షలు చేయిస్తున్నామని, ఎక్కడా పాజిటివ్ కేసులు నమోదు కావడం లేదని తెలిపారు.

మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రకాశం

చిత్తూరు రూరల్: వ్యాధి నిరోధక టీకాలను పక్కాగా వేయించాలని, మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ జి.ప్రకాశం ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు కేసులను గుర్తించి వెంటనే చికిత్సలందించాలని కోరారు. సమావేశంలో డీఐఓ రవిరాజు, మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంగళవారం కోరింది.

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు



గుడిపాల : పాఠశాలలో డెస్క్‌లు పరిశీలిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు నిర్వహించే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలకు 1,244, ఇంటర్‌కు 3,309 మొత్తం 4,553 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. సమావేశంలో డీవైఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వసతులు

గుడిపాల: పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. మంగళవారం కమ్మతిమ్మాపల్లె ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం 197 రామాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. స్కూలు పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భానుప్రసాద్‌రావు, సీఆర్పీ వాణిశ్రీ పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై ప్రజల్లో శ్రద్ధ పెరిగింది.. రసాయన రహిత ఆహార ఉత్పత్తులపై అవగాహన వచ్చింది. సేంద్రియ పంటల కొనుగోలుపై ఆసక్తి అధికమైంది.. అయితే ప్రకృతి విధానంలో సాగుచేసిన కూరగాయలు ఎక్కడ లభిస్తాయి..? క్రిమిసంహారకాలు వాడని ఆకు కూరలు ఎక్కడ దొరుకుతాయి..? పురుగు మందుల అవశేషాలు లేని తీగజాతి కాయకూరలు ఎక్కడ లభిస్తాయి..? ఇలాంటి ప్రశ్నలకు ఓ స్వచ్ఛంద సంస్థ సమాధానం ఇస్తోంది. ఇటు రైతుకు గిట్టుబాటు దక్కేలా.. అటు కొనుగోలుదారుడికి సంతృప్తి కల్పించేలా కార్యాచరణ రూపొందించింది. ఇరువురి భాగస్వామ్యంతో చిన్న కమతాల్లో గోఆధారిత సేద్యానికి బాటలు వేసింది. దళారీలతో పనిలేకుండా అన్నదాత – వినియోగదారుడు నేరుగా ఒప్పందం కుదుర్చుకుని లబ్ధి పొందేలా ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసింది. తిరుపతి సమీపంలోని వేమూరు గ్రామంలో సాగుతున్న విశేష వ్యవసాయాన్ని పరిశీలించేందుకు 'సాక్షి' పొలంబాట పట్టింది. సమగ్ర సమాచారంతో ప్రత్యేక కథనం అందిస్తోంది.

నా రైతు.. నా ఆరోగ్యం

- అన్నదాతకు ఆదరువుగా వినియోగదారులు
- గో ఆధారిత ప్రకృతి సేద్యానికి తోడ్పాటు
- నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్న రైతులు
- 30 సెంట్లలో 20 రకాల కూరగాయల సాగు
- పొలం నుంచి నేరుగా వంటింటికే సరఫరా

యెండ్లూరి మోహన్, సాక్షి తిరుపతి డెస్క్

ఉరుకులు పరుగుల జీవితం.. ఉన్నది తిని జీవనాధారం కోసం కాయకష్టం చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్యంపై అంతగా పట్టించుకునే పరిస్థితులు ఇన్నాళ్లు లేవు. కోవిడ్ దెబ్బకి అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించారు. జీవన విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకుంటున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అవశేషాలు లేని ఆహారం తీసుకునేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. వినియోగదారుల ఆలోచన ఇలా ఉంటే.. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, డిమాండ్ ఉన్న పంటలను పండించినా, వాటిని ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు.

వర్డ్ సంస్థ చొరవతో!

రైతుల కష్టాలను, వినియోగదారుల ఆలోచనలను వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(వర్డ్) సంస్థ వ్యవస్థాపకుడు, జిల్లా వ్యవసాయ బోర్డు సలహామండలి సభ్యుడు డాక్టర్ గంగాధరం గుర్తించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, రసాయనిక ఎరువులు లేని ఆహార ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు ఒక వేదిక అవసరమని భావించారు. గోఆధారితంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సుభాష్ పాలేకర్ విధానమే ఇందుకు సరైన పరిష్కారమని నిర్ణయించుకున్నారు. దీనిపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. చిన్న కమతాల్లోనే ఎక్కువ రకాల పంటలను తక్కువ ఖర్చుతో పండించవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రతి నెలా ఆదాయం వచ్చేలా ఒక వ్యవస్థను ఏర్పాటుచేస్తామని భరోసా ఇచ్చారు. ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వంగ పంట

రైతు–వినియోగదారుల భాగస్వామ్యం

గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన తర్వాత గంగాధరం వినియోగదారులపై దృష్టి సారించారు. ఈ మేరకు తిరుపతిలో గత ఏడాది జూన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు, వినియోగదారులకు పరస్పరం ఒప్పందం కుదిర్చారు. 20 మంది వినియోగదారులకు నెలకు తమ కుటుంబాలకు అవసరమైన 20 రకాల కూరగాయలను రైతు తన 30 సెంట్ల భూమిలో పండించాలి. అందుకు రైతుకు ప్రతి వినియోగదారుడు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తాడు. అంటే నెలకు రూ.30 వేల వరకు చెల్లిస్తారు. ఏడాది పొడవునా ఈ బంధం కొనసాగుతూనే ఉంటుంది. దీనికి రైతు–వినియోగదారుల భాగస్వామ్య పథకం (ఎఫ్‌సీపీ) అని పేరు పెట్టారు.



విత్తు నాటుతున్న పొలంలో వినియోగదారులు



పంటను పరిశీలిస్తున్న వినియోగదారులు

ఏడాదికి రూ.2.4 లక్షల ఆదాయం

ఎఫ్‌సీపీ పథకంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం, వేమూరు, కస్తూరికండ్రిగ, రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు తదితర ప్రాంతాల్లో రైతులు గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. టమాట, వంగ, మిర్చి, కాకర, బీర, సొరకాయ, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు, చుక్కకూర, పాలకూర, తోటకూర, చిర్రాకు వంటి 20 రకాలను ప్రతి వారం వినియోగదారులకు అందజేస్తున్నారు. ఆ వారంలో దిగుబడి అయిన కూరగాయలు, ఆకు కూరలను 20 సమ భాగాలుగా చేసి ఒక్కో ప్రత్యేక సంచిలో వేసి ఆటో ద్వారా ప్రతి వినియోగదారుడి ఇంటికే చేర్చుతున్నారు. కేవలం 30 సెంట్ల భూమిలో నెలకు ఖర్చులు పోగా రూ.20వేలు మిగులుతున్నట్లు రైతులు ఆనందంగా చెబుతున్నారు. అంటే ఏడాదికి దాదాపు రూ.2.4 లక్షల ఆదాయం వస్తోందని వెల్లడిస్తున్నారు.



సేంద్రియ విధానంలో సాగుచేసిన కూరగాయలను భాగాలు వేసిన రైతులు

విశేష స్పందన



తొలి ప్రయత్నంలోనే వినియోగదారులతో ఒప్పందం కుదుర్చుకోవడంతో శ్రమత గ్గింది. గో ఆధారిత సేంద్రియ వ్యవసాయ పద్ధతిని అనుసరించడం వల్ల ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు వస్తున్నాయి. వినియోగదారులు సెలవు రోజుల్లో పంటపొలాలకు వస్తున్నారు.

– గంగాధరం, వర్డ్ సంస్థ ప్రతినిధి, తిరుపతి

సేంద్రియ విధానంలోనే..



దేశీ ఆవుపేడతో సేంద్రియ విధానంలోనే పంటలు పండిస్తున్నాం. 20 మంది వినియోగదారులు ముందుకొచ్చి సాగుకు సాయం అందించారు. వారికి ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్నాం. పంటను ఎలా అమ్ముకోవాలి అనే ఇబ్బంది తప్పింది.

– వెంకటాద్రి, రైతు, వేమూరు

ఒప్పందంతో సత్ఫలితాలు



వినియోగదారునితో నేరుగా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల నిశ్చింతగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సత్ఫలితాలు పొందుతున్నాం. రోజుకు రెండు గంటలు కష్టపడితే పెట్టుబడి పోగా నెలకు రూ.20వేలు మిగులుతోంది.

– మునిరత్నం నాయుడు, రైతు, కస్తూరికండ్రిగ

నాణ్యమైన కూరగాయలకోసమే..



మాకు అవసరమైన కూరగాయలను సేంద్రియ పద్ధతిలో రైతు సాగుచేస్తున్నాడు. ఎలా చేస్తున్నారో మనమే వెళ్లి చూసుకోవచ్చు. రైతు ఏం చేస్తున్నాడో మనకు వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేస్తున్నాడు. ఇంతకంటే మంచి కూరగాయలు ఎలా దొరుకుతాయి?.

– టీవీ మనోహర్, వినియోగదారుడు, తిరుపతి

క్రీడాకారుడికి ఆర్థికసాయం



సతీష్‌కు రూ.3లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం/కుప్పంరూరల్ : మండలంలోని ఎస్.కొత్తపల్లెకు చెందిన క్రీడాకారుడు సతీష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3లక్ష సాయం అందింది. మంగళవారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ చేతులమీదుగా లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. జాతీయ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, హైజంప్ క్రీడల్లో రాణిస్తున్న సతీష్‌కు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలో ఇటీవల కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి క్రీడాకారుడి దుస్థితిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి రూ.3లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందించిన సాయంతో మెరుగైన శిక్షణ తీసుకుని అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు కృషి చేస్తానన్నారు. నగదు ప్రోత్సాహకం మంజూరయ్యేందుకు సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురుగేష్ పాల్గొన్నారు.

అలసత్వం లేకుండా ఆరోగ్యశ్రీ సేవలు

చిత్తూరు రూరల్ : అలసత్వం లేకుండా రోగులకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్ ఆదేశించారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో ఆయన ఆరోగ్యశ్రీ అధికారులు, మిత్రలతో సమావేశం నిర్వహించారు. రోగులతో దురుసుగా ప్రవర్తించకూడదని, దగ్గరుండి వారికి పూర్తిసేవలందేలా చూడాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరిస్తాం.. ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఆర్టీసీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములే
- తిరుపతిలో తొలి సీసీఎస్ రాష్ట్ర స్థాయి సర్వసభ్యసమావేశం
- ఆర్టీసీకి చెందిన పలు అంశాలపై తీర్మానం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ, సీసీఎస్ పాలక మండలి చైర్మన్ ద్వారకా తిరుమలరావు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని ఆ సంస్థ ఎండీ, సీసీఎస్ పాలకవర్గ మండలి చైర్మన్ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ ప్రాంతం, రామచంద్రాపురం మండలం, చిగురువాడ నిషాల్ కన్వెన్షన్ హాల్‌లో సీసీఎస్ (క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ) మూడో సమావేశాన్ని తొలిసారిగా తిరుపతి జిల్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీకి చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. ముందుగా సీసీఎస్ పాలకవర్గ మండలి చైర్మన్, ఆర్టీసీ ఎండీతోపాటు సీసీఎస్ వైస్ చైర్మన్, ఈడీఏ కోటేశ్వరరావు, సెక్రటరీ దాసు, ఈడీ గోపీనాథ్‌రెడ్డి, డీపీటీఓ చెంగల్‌రెడ్డికి సీసీఎస్ సభ్యులు (డెలిగేట్స్) స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు మంచిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని, ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో చర్చించి వాటికి పరిష్కారం చూపుతామని వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్ పాలకవర్గ మండలి సభ్యులు శ్రీనివాసరాజు, అనంతరావు, వినోద్‌బాబు, గోపాల్, శేఖర్‌తోపాటు 220 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు సత్యనారాయణ, అవుల ప్రభాకర్ యాదవ్, రెడ్డెప్ప, పెరుమాళ్, బీఎస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

- ఎడ్యుకేషన్ రుణాలను రూ.5.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంపు
- రిమూవల్ అయిన ఉద్యోగి మృతిచెందితే రుణాలను రైట్ ఆఫ్ చేయడం
- అసోసియేట్ డిపాజిట్ సేకరణ బదులుగా వీఎంఆర్‌డీఎఫ్‌కి చెందిన కొత్త పథకం ద్వారా ప్రతి నెలా సేకరణ చేసి విరమణ సమయంలో డిపాజిట్ చేసేలా మార్పు

బోధన..అభ్యసన అనుసంధానానికి 'దీక్ష'

- 31 వరకు టీచర్లకు ఆన్‌లైన్ శిక్షణ
- అనంతరం అసెస్‌మెంట్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు విద్యాశాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు సోమవారం నుంచి ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో శిక్షణ అందిస్తోంది. జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠ్యాంశాల బోధన.. అభ్యసన సామర్థ్యాల అనుసంధానమే లక్ష్యంగా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ నాలెడ్జ్ షేరింగ్ (దీక్ష)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. టీచింగ్–లెర్నింగ్– ఈ–కంటెంట్‌ను దీక్ష ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేసింది.

శిక్షణ తప్పనిసరి



ప్రతి ఉపాధ్యాయుడికి కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు అవసరం. టీచర్లందరూ తప్పనిసరిగా శిక్షణ పొందాల్సి ఉంటుంది. దీని వల్ల బోధనాభ్యసన పద్ధతులను మెరుగుపరుచుకునే వీలుంటుంది. అందుకే పక్కాగా దీక్ష శిక్షణను నిర్వహిస్తున్నాం.

– వి.వెంకటరమణారెడ్డి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ, చిత్తూరు

పకడ్బందీ పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోని టీచర్లందరికీ దీక్ష ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. బోధన, అభ్యసన, ఈ నెల 31వ తేదీ వరకు రోజూ సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు. మొత్తం 16 వేల మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలు, సమగ్ర శిక్ష సిబ్బంది శిక్షణ పొందుతున్నారు.

నేర్చుకున్న అంశాలపై పరీక్ష

శిక్షణ పొందిన టీచర్లకు నేర్చుకున్న అంశాలపై అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 21వ తేదీ వరకు ప్రత్యేక లింక్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఒకే ప్రయత్నంలో 70 శాతం స్కోర్ సాధించిన వారికి మెయిల్ ద్వారా సర్టిఫికెట్ అందిచనున్నారు.

నేటి నుంచి పంగుణోత్తర కల్యాణోత్సవం



మంత్రి రోజా వితరణగా అందజేసిన నంది వాహనం

నగరి : పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరాలయంలో బుధవారం నుంచి పంగుణోత్తర కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభంకానున్నాయి. ముందుగా ధ్వజారోహణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సూర్యప్రభవాహనం, 30న చంద్రప్రభ వాహనం, ఏప్రిల్ 1వ తేదీన శేష వాహనం, 2న నంది వాహనం, 3న గజవాహనం, 4న రథోత్సవం, 5న కల్యాణోత్సవం, 6వ తేదీన రావణేశ్వర వాహన సేవలు జరిపించనున్నారు. ఈ ఏడాది ఉత్సవాలకు పంచలోహాలతో తయారుచేసిన వాహనాలను వినియోగిస్తుండడం విశేషం. ముఖ్యంగా మంత్రి ఆర్‌కే రోజా రూ.1.5 లక్షల విలువైన నంది వాహనాన్ని అందించా ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



చిత్తూరు అర్బన్: నగరంలోని మెసానికల్ మైదానం ప్రహరీ గోడ ఇనుప కడ్డీకి మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుడి చేతికి నల్లని కాశీదారం ఉందని ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796705 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

కార్డెన్ సెర్చ్‌లో 20 వాహనాల సీజ్



ప్రజలను విచారిస్తున్న సీఐ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో మంగళవారం వేకువజామున సీఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సక్రమంగా పత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐలు మోహన్‌కుమార్, కుళ్లాయప్ప, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా పట్టివేత: ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

చిత్తూరు అర్బన్: మండలంలోని తుమ్మింద గ్రామంలో సారా తయారు చేస్తున్న గోవిందరాజులు, కృష్ణమూర్తి అనే ఇద్దరు వ్యక్తులను మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఊటను ధ్వంసం చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు పాల్గొన్నారు.

వైద్యం 104 రూపేణా..!

పల్లెప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం వైద్యరంగంలో విప్లవాత్మకమైన సంస్కరణకు శ్రీకారం చుట్టింది. పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత ఊరిలోనే చికిత్సలు పొందే వెసులుబాటు కల్పించింది. తొలుత గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ప్రారంభించింది. 104 వాహనాల ద్వారా వైద్య నిపుణులతో సేవలందిస్తోంది. దీర్ఘకాలిక రోగులు, వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది.

- గ్రామీణులకు ఆరోగ్య రక్ష
- పల్లెసీమల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- 104 వాహనాల ద్వారా విస్తృత సేవలు
- రోగులకు ఇంటి వద్దనే చికిత్సలు



104 వాహనం ద్వారా గ్రామంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

సాక్షి, చిత్తూరు : ప్రభుత్వం వైద్యరంగంలో పెను మార్పులను తీసుకువచ్చింది. పట్టణాల్లోని ప్రజలతోపాటు పల్లెవాసులకు సైతం మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీ చేసింది. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 104 వాహనాలతో గ్రామీణ ప్రాంతాల్లోని వారికి నాణ్యమైన వైద్యసేవలను అందిస్తోంది.

వరంగా మారిన 104 వాహనాలు

గ్రామాల్లో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులతో పాటు దీర్ఘకాలిక రోగులకు 104 సంచార వాహనాల వైద్య సేవలు వరంగా మారాయి. పట్టణాలు, మండలకేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరులో ఇంటి వద్దనే ఉచితంగా చికిత్సలు అందుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 44 వాహనాలు పల్లెప్రజలకు సేవలందిస్తున్నాయి.

- 104 వాహనాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామీణ ప్రాంతాల్లోని సంచరిస్తుంటాయి. పీహెచ్‌సీ వైద్యుడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు ఆయా వాహనాల్లో అందుబాటులో ఉంటారు.
- గ్రామ సచివాలయం వద్ద వైద్య సేవలందిస్తారు. అలాగే మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నవారితోపాటు గర్భిణులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతుల మేరకు మందులు అందిస్తున్నారు. సుమారు 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారు.
- ఆదివారం మినహా నెలలో 26 రోజులపాటు 104 వాహనాల ద్వారా సేవలందుతాయి. ఒక గ్రామానికి ప్రతి నెలా రెండు పర్యాయాలు వస్తుంది.
- 104లో ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతి రోగి వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో పొందుపరుస్తారు. టెలీ మెడిసన్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు అనుసంధానిస్తారు. భవిష్యత్‌లో ఎక్కడైనా తక్షణ వైద్యసేవలు అందేలా జాగ్రత్తలు తీసుకుంటారు. రోగి ఆరోగ్య స్థితిని బట్టి ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

ఆరోగ్య సమస్యల పరిష్కారం



గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు తలెత్తే ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు 104 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. వీటి ద్వారా అందే సేవలపై పల్లెవాసులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడ ఎలా చికిత్సలు పొందాలో తెలియజేస్తున్నాం. దాదాపు 80శాతం సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరిస్తున్నాం. – హరినారాయణన్, కలెక్టర్

నిరంతరం సేవలు



గ్రామ సచివాలయాలే కేంద్రంగా ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేలా చూస్తున్నాం. 104 వాహనం ద్వారా గ్రామ స్థాయిలో ఉదయం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ, మధ్యాహ్నం తర్వాత ఇళ్లకు వెళ్లి చికిత్సలందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రజలకు నిరంతరం సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. – ప్రకాశం, డీఎంహెచ్‌ఓ

నిర్దేశించిన గ్రామాలకు వాహనాలు



నిర్దేశించిన గ్రామాలకు 104 వాహనాలు వెళ్లేలా చూస్తున్నాం. సిబ్బంది హాజరు, మందుల సరఫరా, వాహనాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. – జి. ప్రతాప్, 104 జిల్లా మేనేజర్

మా ఊరిలోనే వైద్యం



నాలుగేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నా. ప్రతి నెలా తప్పకుండా మా ఊరికి వచ్చి, నాకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తున్నారు. తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. మా వద్దకే వచ్చి వైద్య సేవలను అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. – ఎన్. జయమ్మ, జంగాలగ్రహారం, బైరెడ్డిపల్లె మండలం



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	24
తిరుపతి	37	24
తిరుమల	32	20
గూడూరు	37	26
నగరి	37	24

అసెంబ్లీ సెగ్మెంట్లకు బీజేపీ కన్వీనర్ల నియామకం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరుకు కడియాల సురేష్, కుప్పానికి శివశంకర్, పలమనేరుకు విజయ్‌కుమార్, జీడీ నెల్లూరుకు రాజేంద్రన్, పూతలపట్టుకు కిషోర్ చౌదరి, పుంగనూరుకు మదన్‌మోహన్, నగరికి రాజశేఖర్‌రాజును నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఐఎన్‌టీఎస్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు శ్రీ చైతన్య ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ చక్రధర్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 3 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించారన్నారు. రెండో లెవల్ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదో స్థాయి బహుమతులు సాధించారని వివరించారు. మొదటి బహుమతి సాధించిన ఈషాసాయికి ట్యాబ్‌ను బహుమతిగా అందజేశారని వెల్లడించారు

క్రీడా సంఘాలకు నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : క్రీడా సంఘాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, తైక్వాండో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరులో ఏపీ తైక్వాండో సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు : ఇద్దరి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

వడమాలపేట : మండలంలోని వెంగళరాజుకండ్రిగ వద్ద తిరుపతి– చెన్నై జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన డేవిడ్, రాకేష్, దినేష్, డోలారామ్, రామ్‌నివాస్ తిరుపతిలోని అవిలాలలో నివసిస్తున్నారు. వీరు అక్కడే ఓ స్టీల్ దుకాణం నడుపుకుంటున్నారు. షాప్‌కు కావాల్సిన మెటీరియల్‌ను కొనుగోలు చేసేందుకు సోమవారం కారులో చెన్నైకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఉండగా ప్రమాదవశాత్తు కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. దీంతో దినేష్ అక్కడికక్కడే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ రామ్‌నివాస్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ముగ్గురికీ ప్రస్తుతం రుయాలో వైద్యం అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్మశానవాటికల భూసేకరణ వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శ్మశానవాటికల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వే శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్మశాన వాటికల కోసం ఇప్పటికే గుర్తించిన భూమికి హద్దులు నిర్ణయించాలన్నారు. రీ సర్వేలో భాగంగా సర్వే రాళ్లు నాటించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్సీకే రాజుకు 'కీర్తి పురస్కారం'



రాజును సత్కరిస్తున్న వీసీలు కిషన్‌రావు, రవీందర్

పుత్తూరు రూరల్: తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'బులుసు బుచ్చి సర్వారాయుడు స్మారక కీర్తి పురస్కారం' అందించింది. మంగళవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో హాస్య కథా రచన విభాగంలో విశిష్ట సేవలకు గాను ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య తంగేడు కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్సలర్ డి.రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ఐరాల: గుర్తుతెలియని వాహనం ఢీకొని మంగళవారం రాత్రి ఓ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మద్దిపట్లపల్లె సమీపంలో చోటుచేసుకుంది. కాణిపాకం ఏఎస్‌ఐ ఆర్ముగం కథనం మేరకు.. తవణంపల్లె మండలం పల్లెచెరువుకు చెందిన ఉపాధ్యాయుడు గోపినాథ్‌రెడ్డి(55). ఇతను కొత్తగొల్లపల్లెలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఐరాల మండలం పెండ్లిగుండపల్లెలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి చిత్తూరు నుంచి బైక్‌లో పెండ్లిగుండ్లపల్లెకు వెళుతుండగా మద్దిపట్లపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపినాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ చెప్పారు

● విశాఖలో ముఖ్యమంత్రికి స్వాగతం



జీ–20 సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా

కాటేరమ్మ దేవర..కన్నీటి వరదరా!

కోరిన కోర్కెలు నెరవేర్చడంతో కులదైవమైన కాటేరమ్మకు దేవర చేయాలని నిశ్చయించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న బంధుగణాన్ని ఆహ్వానించారు. అందరూ సంతోషంగా అమ్మవారికి పూజలు చేస్తున్నారు. ఇంతలో కొండకింద ఉన్న కోనేట్లో ఆయా కుటుంబాలకు చెందిన ముగ్గురు బాలికలు ఒకరివెంట ఒకరు సరదాగా దిగి కానరాని లోకాలకు వెళ్లిపోయారు. చేతికొచ్చిన బిడ్డలు దూరమవ్వడంతో బంధువులు గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఈ ఘటన మంగళవారం పలమనేరు నియోజకవర్గం, బైరెడ్డిపల్లె మండలం, తీర్థం సమీపంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయం వద్ద తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.



ముగ్గురి ప్రాణాలను మింగేసిన కోనేరు ఇదే

- కాటేరమ్మ దేవరకొచ్చి..కానరాని లోకాలకు
- ముగ్గురు బాలికలను మింగేసిన కోనేరు
- కాళ్లకు చుట్టేసిన పాచి
- ఒకరివెంట ఒకరు మృత్యుఒడికి
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం
- బైరెడ్డిపల్లె మండలంలో ఘటన

పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం, దేవదొడ్డి గ్రామానికి చెందిన కదిరప్ప కూలిపనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో మొక్కుకున్న మొక్కు తీరడంతో గ్రామ సమీపంలోని కాటేరమ్మకు దేవర చేయాలని భావించాడు. దేవరకు తమిళనాడు రాష్ట్రంలోని అరవట్లకు చెందిన బంధువులను పిలిచాడు. మంగళవారం అందరూ కలిసి కాళభైరేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు చేస్తుండగా.. అదే సమయంలో ఆయా కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలు కొండ కింద కోనేటి వద్ద ఆటలాడేందుకు వెళ్లారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో కోనేట్లో దిగి స్నానాలు చేయాలని భావించారు. ఈ క్రమంలో దేవదొడ్డికి చెందిన కదిరప్ప కుమార్తె గౌతమి(14), కదిరప్ప బంధువులైన అరవట్లకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె భవ్య(17), లేట్ వెంకటరమణ కుమార్తె మౌనిక(13) ఒకరివెంట ఒకరు దిగి మృత్యుఒడికి చేరారు. చాలా ఏళ్లుగా పాడుబడిన కోనేటి కింది భాగంలో పాచిపట్టిపోవడం.. అది కాళ్లకు తగులుకుని బిడ్డలను పైకిరాకుండా చేసిందని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

మూడు కుటుంబాల్లో విషాదం

దేవదొడ్డికి చెందిన కదిరప్పకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వీరిలో చిన్న కుమార్తె నీట మునిగి మృతిచెందింది. అరవట్లకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె భవ్య, అదే గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తె మౌనిక ఒకరివెంట ఒకరు కోనేట్లో దిగి ప్రాణాలు వదిలారు. ఇదిలావుండగా ఇటీవలే మౌనిక తండ్రి వెంకటరమణ మృతిచెందాడు. ఆ జ్ఞాపకాలు మరువక ముందే కుమార్తె దూరమవ్వడం ఆ ఇంట తీరని విషాదాన్ని నింపింది. కోనేటి వద్ద ఆలయానికి సంబంధించిన నిర్వాహకులు పర్యవేక్షణ లేకపోవడం, ఈ ఆలయం అడవిలో ఉండడంతో వారు ప్రాణాలను ఎవరూ కాపాడలేకపోయారు.



బాలికల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు